క్లుప్తంగా

23న జేఎన్‌టీయూహెచ్ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

బాలానగర్: జేఎన్‌టీయూ హైదరాబాద్ పరిధిలో నిర్వహించాల్సిన మహిళా కబడ్డీ విశ్వవిద్యాలయ స్థాయి సెలక్షన్లు ముందుగా నిర్ణయించినట్లు అక్టోబర్ 18న జరగాల్సి ఉంది. అక్టోబర్ 23వ తేదీకి వాయిదా వేసినట్లు విశ్వవిద్యాలయ క్రీడా మండలి కార్యదర్శి, ప్రొఫెసర్ ఎన్ఎస్. దిలీప్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18న రాష్ట్ర వ్యాప్తంగా జరుగనున్న బీసీ బంద్ వల్ల క్రీడా ఎంపికలను వాయిదా వేసినట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: మూసాపేట డివిజన్ చైతన్య బస్తీలో రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్ మహేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ శైలజ, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, నాయకులు ఐలయ్య, రవిగౌడ్, ప్రశాంత్ రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలో రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ తూము ఎల్లారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అక్రమ నిర్మాణ వివరాలను అధికారులకు వివరించారు. వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం



కేఎంఆర్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: డ్రైనేజీ సమస్యను త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లిలోని మసీదుబండ కేఎంఆర్ ఎస్టేట్ కాలనీలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎంఆర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాలనీలో ఔట్ లెట్ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. అవసరమున్న చోట మ్యాన్‌హోల్స్ పునరుద్ధరించాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

మహాపాదయాత్ర ప్రారంభం

రాయదుర్గం: శబరిమల మహాపాదయాత్ర ప్రారంభమైంది. గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు రంగనాథస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, రఘునాథ్‌రెడ్డి నాయకులు శ్రీనివాస్‌యాదవ్, నాగరాజు, శ్రీరామ్‌నాయక్, అయ్యప్పభక్తులు, కుటుంబసభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

క్రాకర్స్ దుకాణాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



సూచనలు చేస్తున్న బాలానగర్ సీఐ

బాలానగర్: దీపావళి పండుగ సందర్భంగా బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేయనున్న బాణసంచా దుకాణాల ఏర్పాట్లను బాలానగర్ సీఐ నర్సింహరాజు ఎస్ఐ వినోద్‌కుమార్‌లతో కలిసి శుక్రవారం పర్యవేక్షించారు. ప్రధాన రహదారిపై దుకాణాల ఏర్పాటుకు కేటాయించిన ప్రాంగణాన్ని పరిశీలించారు. టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ప్రతి దుకాణానికి మధ్య కనీసం మూడు మీటర్ల దూరం, రెసిడెన్షియల్ ప్రాంతాలు, ఇళ్ల నిర్మాణాలు ఉన్న చోట 50 మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలన్నారు. వ్యాపారులకు వివిధ సూచనలు చేశారు.

నేటి బంద్‌కు సంపూర్ణ మద్దతు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కేటాయింపు నిర్ణయానికి బీఆర్ఎస్ కట్టుబడి ఉందని, శనివారం నిర్వహించే బీసీ సంఘాల ఐక్యవేదిక బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. రిజర్వేషన్ల కల్పన విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దశ, దిశాలేని తొందరపాటు నిర్ణయాలు తీసుకుని ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా అన్ని పార్టీలతో అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేసి కేంద్రం వద్దకు వెళ్లి రిజర్వేషన్లను సాధించాల్సిన అవసరం ఉందన్నారు. బంద్‌లో బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేటి బీసీ సంఘాల బంద్‌ను జయప్రదం చేయాలి



సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘాలు, సీపీఎం నాయకులు

బాలానగర్: బీసీ సంఘాల ఆధ్వర్యంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం తలపెట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఎం శాఖ కార్యదర్శి మనోచారి, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి కృష్ణ పిలుపునిచ్చారు. శ్రీశ్రీ నగర్ సీపీఎం పార్టీ కార్యాలయంలో శుక్రవారం బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 42 శాతం రిజర్వేషన్ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పాలకులు బీసీల పట్ల శ్రద్ధ వహించి పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని కోరారు. సమావేశంలో బాసెట్టి నర్సింగరావు, జగన్, దేవదానం, నర్సింగరావు, చిలక ప్రకాష్, ఎం. చంద్రమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

31 వరకు స్వచ్ఛతా పక్వాడా

బాలానగర్: పాఠశాల, ఇంటి పరిసరాల్లో ఎక్కడైనా స్వచ్ఛత పాటించాలని, దీంతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని బాలానగర్ ఎంఈఓ హరిచందర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నా రు. శుక్రవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా రాజు కాలనీలోని, జడ్పీహెచ్ఎస్‌లలో ప్రతిజ్ఞ చేయించ నున్నరాని తెలిపారు. స్వచ్ఛతపై రోజు వారీ కార్యక్రమాలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అన్ని హంగులతో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: అన్ని హంగులతో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్‌నగర్‌లో రూ.3 18 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ మొదటి అంతస్తు నిర్మాణ పనులను, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రహరీ నిర్మాణం కోసం జరుగుతున్న తవ్వకాల సమయంలో పగిలిన మంజీరా వాటర్ పైపులైన్‌కు వెంటనే మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని జలమండలి అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, జి. రవి, సీహెచ్. భాస్కర్, అగ్రవాసు, బాలస్వామి, పి. మహేష్, ప్రభాకర్, చంద్రయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కూకట్‌పల్లి: సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ మీద దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం బాలానగర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చీఫ్ జస్టిస్ మీద దాడి వెనుక ఉన్న శక్తులను కూడా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ముత్యపాగ శ్రీనివాస్, రాసమల యాదగిరి, సిల్వర్ శ్రీనివాస్, రవి, ఏసు, రాములు, రాము తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ప్రభుత్వ కళాశాల విద్యార్థి



అభిరామ్

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి అభిరామ్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీజీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అల్వాల్‌లోని వీవీ అకాడమిలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో ప్రతిభ కనబరిచాడు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల కళాశాల సిబ్బంది, ప్రిన్సిపాల్ వెంకటయ్య సంతోషం వ్యక్తం చేశారు.